
# క్లినికల్లీ డెడ్

– డి.సుగుణమణి



తాను పుట్టిపెరిగిన జిల్లాని వదిలి హైదరాబాద్ వెళ్లడానికి ఇష్టం లేకపోయినా పిల్లల చదువులకోసం హైదరాబాద్‌కి బదిలీ కావాలని ఒక ప్రభుత్వరంగ బ్యాంకులో ఆఫీసరుగా ఉద్యోగం చేస్తున్న వెంకట్రావు దరఖాస్తు పెట్టుకున్నాడు. కొడుకు ఐఐటి లాంగ్‌టర్మ్ కోచింగ్ కోసం, కూతురు లాంగ్‌టర్మ్‌కి వెళ్లకుండానే మెడికల్ సీటు సాధిస్తుందన్న ఆశతో కన్నతల్లిలాంటి ఉంటున్న ఊరుని వదిలి హైదరాబాద్ బయల్దేరాడు. అంతరాత్మ ఎంతగా వద్దని ప్రబోధిస్తున్నా తుంగలో తొక్కి హైదరాబాద్ భార్యాపిల్లలతో చేరుకున్నాడు.

వెంకట్రావుకి హైదరాబాద్ వచ్చిన దగ్గర్నుండి గజిబిజిగా, గందరగోళంగా ఉంది. రోడ్లమీద విపరీతమైన కాలుష్యంతో ఊపిరాడకపోతుంటే, ఇంట్లో భార్యాపిల్లలు కొత్త కోరికల చిట్టా విని గుండెల్లో బేజారు మొదలైంది. అమ్మాయి కాలేజ్‌కి సంగీతానికి వెళ్లడానికి స్కూటీ కావాలని, అబ్బాయి కోచింగ్‌కి టెన్నిస్‌కి వెళ్లడానికి బజాజ్ పల్సర్ కావాలని పేచీ ప్రారంభించారు. 'ముందు క్వార్టర్లీ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోండి, తరువాత ఆలోచిస్తాను'అన్న వెంకట్రావు మాటల్ని అస్సలు పరిగణనలోకి తీసుకోకుండా తాము పట్టిన కుందేటికి మూడు కాళ్లేనన్న చందంగా మంకుపట్టు పట్టారు. పెద్ద పల్లెటూరులాంటి టౌన్లో ఉన్నన్నాళ్లు స్కూటర్ కొనమని కూడా అడగని శ్రీమతి ఇప్పుడు ఏకంగా కారే కొనమని పోరు ప్రారంభించింది. ఇన్నాళ్లు ప్రశాంతంగా ఉన్న పిల్లకాలువలో సాగిన వెంకట్రావు ప్రయాణం, నగరం రాగానే వరద గోదారిలో దిక్కులేని ప్రయాణంలా అగమ్యగోచరంగా మారిపోయింది.

నగరం ఒక మహామాయావిలా తోచింది వెంకట్రావుకి. ఇన్నాళ్లు అవసరాలుగా తోచని వస్తువులు నేడు అవసరంగా అనిపిస్తున్నాయంటే దానికి కారణం నగరం చేసిన మాయాజాలమే అనిపించింది. 'మా క్లాసులో చాలామంది స్టూడెంట్స్ సొంత వాహనాల్లో వస్తారని పిల్లలంటే, మన అపార్ట్‌మెంట్స్‌లో అందరికీ కార్లున్నాయి మనకి తప్ప అని శ్రీమతి అంటుంది.'

మనిషి తన తోటివాడితో పోల్చుకోవడం మొదలెడితే అది ఎప్పటికీ తెగని పోరాటంలా మారుతుందన్న సూక్తి తన కుటుంబ సభ్యులు నిజం చేసారనిపించింది వెంకట్రావుకి. అందుకేనేమో నగరంలో జనాలు రేయింబవళ్లు తేడాలేకుండా పరుగులెడుతూ ఒత్తిడిని, బిపిని, షుగర్ వ్యాధిని కొనితెచ్చుకుంటున్నారనిపించింది.

ఏది ఏమైనా నగరం వచ్చిన రెండునెలలకే తను కోల్పోయిందే ఎక్కువని, సాధించింది ఏమీలేదని అర్థమైంది వెంకట్రావుకి. బ్యాంకులో పని ఒత్తిడికి తోడు, ఇంటిలోవాళ్ల కోరికల ఒత్తిడి తోడైంది. సొంతూర్లో ఉన్న వాళ్లు ఇంత ఒత్తిడి ఉండేది కాదు. వారానికోసారి దగ్గర్లో ఉన్న సొంత గ్రామానికి వెళ్లి, అమ్మానాన్నల్ని చూసేవాడు. వాళ్లుకూడా తన గురించి ఎదురుచూసేవాళ్లు. వాళ్లని చూడగానే వారమంతా పడ్డ కష్టాన్ని, శ్రమని మరచిపోయేవాడు. మళ్లీ పూర్తిస్థాయిలో రీఛార్జ్ అయ్యి విధులకు హాజరయ్యేవాడు. హైదరాబాద్ వచ్చిన దగ్గర్నుండి వెంకట్రావుకి తల్లిదండ్రులను ప్రతివారం కలిసే అవకాశం పోయింది. బ్యాంక్‌లో పని పూర్తయిన తరువాత ఇంటికి వెళ్లాలని ఇన్నాళ్లలాగా అనిపించడం లేదు. బ్యాంక్‌లో పని ఏడుకే పూర్తయిపోతున్నా తరువాత లుంబినీలోనో, ఎన్టీఆర్ గార్డెన్‌లోనో, రవీంద్ర భారతిలోనో గడిపి రాత్రి తొమ్మిదికో పదికో ఇంటికెళ్తున్నాడు. ఒకప్పుడు ఒంటరితనమంటే హడలిపోయే వెంకట్రావుకి హైదరాబాద్ వచ్చిన తరువాత ఒంటరితనమే ఎంతో ప్రియమనిపిస్తోంది.

ఇప్పుడు తన భార్యాపిల్లల కోరికలు తీర్చాలంటే కనీసం మూడు లక్షలు కావాలి. అన్ని కటింగ్స్ పోను వచ్చే జీతం పిల్లల చదువులకి, ఇంటి ఖర్చుకి సరిపోతుంది. దీనికితోడు సొంతూర్లో ఇల్లు అమ్మేసి ఇక్కడే ఫ్లాట్ తీసుకుందామని ఈమధ్యకాలంలో శ్రీమతినుండి పోరు ఎక్కువయిపోయింది. ఆవిడ అమాయకత్వం చూసి నవ్వాలో ఏడవాలో వెంకట్రావుకి అర్థంకాలేదు. అక్కడ ఇల్లు అమ్మినా ఇక్కడ ఫ్లాట్ నాలుగోవంతు ఖరీదుకి సమానమన్న విషయం ఎలా చెప్పాలో తెలియడం లేదు. సొంతూర్లో ఇంటిని అమ్మాలన్న ఆలోచనే ముచ్చెమటలు పోయించింది. ఇంటి చుట్టూ పెంచిన పూలమొక్కలు, కూరగాయల మొక్కలు, చెట్లు, ఆప్యాయంగా పలకరించే ఇరుగుపొరుగు అన్నీ గుర్తొచ్చాయి. అసలు హైదరాబాద్ వచ్చాడంటే పిల్లల భవిష్యత్ కోసమే గాని మోజుపడి కాదు. కానీ ఇలా హైదరాబాద్ వచ్చి అభిమన్యుడిలా పద్మవ్యూహంలో ఇరుక్కుపోయి బయటకు ఎలావెళ్లాలో తెలియక మదనపడతానని కలలో కూడా అనుకోలేదు.

చిన్నప్పుడు ఎన్నో కలలు కన్నాడు. ఆటపాటల్లో రాణించాలని, పర్యాటక ప్రదేశాలు చూడాలని, మంచి పుస్తకాలు చదవాలని... ఇలా ఎన్నో అనుకునేవాడు. ఆటల్లో పాల్గొంటే తండ్రికి సహాయం చెయ్యడం కుదరదని వాటిని త్యాగంచేసాడు. సంగీతం నేర్పే మాష్టారు ఊర్లోనే ఉన్నా సెలవుల్లో కూడా వ్యవసాయం పనులతో వెళ్లడం అయ్యేది కాదు.

తను చెయ్యలేనివి తన పిల్లలైనా చెయ్యగలగాలని అమ్మాయిని సంగీతానికి, అబ్బాయిని టెన్నిస్‌కి పంపిస్తున్నాడు. అమ్మాయికి సంగీతంకన్నా, చదువుకన్నా స్కూటీ మీద తిరగాలని, జీన్ పేంట్స్ టీషర్ట్స్ ధరించాలని అనుకుంటుంటే, అబ్బాయి చదువుమీద ఆటమీద కాకుండా బైక్ మీద షికార్లు కొట్టడానికో, ఫ్రెండ్స్‌తో తిరగడానికో ఇష్టపడుతుంటే, వాళ్లని వారించాల్సిన శ్రీమతి తన కోరికల ఎజెండా బయటపెడుతుంటే ఏమీచెయ్యలేని నిస్సహాయతలో నిప్పులు చెరిగే ఎండలో ఎడారిలో తప్పిపోయినట్లు, రక్తం గడ్డకట్టించే చలిలో మంచు ధృవాల్లో ఇరుక్కుపోయినట్లు అనిపిస్తోంది వెంకట్రావుకి హైదరాబాద్ వచ్చినప్పట్నుండి.

గ్లోబలైజేషన్ సంస్కృతుల్ని, సంప్రదాయాల్ని ఛిన్నాభిన్నం చేస్తుందని, ఉమ్మడి కుటుంబాల్ని చిన్న కుటుంబాలుగా, చిన్న కుటుంబాల్ని కూడా చీల్చేసి వ్యక్తినే కుటుంబంగా చేస్తుందని సొంతూర్లో లెఫ్టిస్టులు వాదిస్తుంటే నవ్వుకునేవాడు. గ్లోబలైజేషన్‌ని ఒక భూతంగా వాళ్లు వర్ణిస్తుంటే చూసి జాలిపడేవాడు. మనలో ఉండాలి కానీ ఎవరో వచ్చి మన భావాల్ని, అభిరుచుల్ని, లైఫ్ స్టైల్స్‌ని ప్రభావితం చెయ్యడం ఏమిటి అనుకునేవాడు. నా కుటుంబాన్ని ప్రపంచంలో ఏ కాన్సెప్ట్ మార్చలేదని ధీమాగా ఉండేవాడు. తమ కుటుంబ సభ్యుల మధ్య ఉన్న అనుబంధాలు, ప్రేమలు అలానే ఎప్పటికీ ఉండిపోతాయని అనుకునేవాడు. కానీ నగరం వచ్చి రెండు నెలలయిందో లేదో కాని అప్పుడే తన కుటుంబంలో ముగ్గురి అభిరుచులు పూర్తిగా మారిపోయాయి. వాళ్లు ముగ్గురూ మూడు వేరువేరు గ్రహాల్లాగా వేరువేరు కక్ష్యల్లో తమ కొత్త కోరికల చుట్టూ పరిభ్రమిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో ఏంచెయ్యాలో అర్థంకాలేదు వెంకట్రావుకి. పిల్లలకు ఎంతగానో చెప్పి చూసాడు. "మా క్లాసులో సిటీ బస్సులో వెళ్లే పదిహేనుమందిలో ఒకరిని నేను" అని అమ్మాయి, "మా క్లాసులో రెండు లక్షల రూపాయలు విలువచేసే బైక్‌లో వచ్చే వాళ్లు ఉన్నారు తెలుసా" అని అబ్బాయి వితండవాదానికి దిగారే తప్ప అర్థం చేసుకోలేదు.

"మరి సిటీ బస్సులో కూడా వెళ్లడానికి డబ్బుల్లేక నడిచి వెళ్లేవారు ఎంతమంది లేరు?' అన్న వెంకట్రావు ప్రశ్నకి 'మాకు కావాల్సినవి అడిగాం నువ్వు కొనిపెట్టగలవో లేదో చెప్పు డాడీ, ఇంతకు మించి ఆర్గ్యుమెంట్స్ వద్దు"అని వాళ్ల గదిలోకి వెళ్లి తలుపులేసుకునే పిల్లలకి ఎలా కన్విన్స్ చెయ్యాలో అర్థంకావట్లేదు వెంకట్రావుకి.

"మేం అడిగిన వాటిని కొనిపెట్టలేని దద్దమ్మవి నువ్వు అని అంటారని కాదు, నువ్వు మాకోసం ఈమాత్రం చెయ్యలేవా అన్నట్లు చూస్తారనే" వాళ్ల గదిలోకి వెళ్లే ప్రయత్నం చెయ్యడు.

వెంకట్రావు ఈ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంటే మరో సంక్షోభం ముందుకొచ్చింది. వెంకట్రావు పనిచేసే బ్యాంక్‌లో చాలామంది ఆఫీసర్స్ ప్రైవేటు బ్యాంకుల్లో మంచి ఆఫర్స్ వస్తున్నాయని, ఇక్కడ జీతాలకి అక్కడ రెట్టింపు జీతాలు ఇస్తారని, ప్రైవేటు బ్యాంక్‌ల్లోకి వెళ్లాలా వద్దా అని తర్జన భర్జనలు పడుతున్నారు. ఇక్కడ పని ఒత్తిడికే తట్టుకోలేకపోతున్నాం, ప్రైవేటు బ్యాంకుల్లో ఉండే పని ఒత్తిడికి తట్టుకోగలమా అని కొంతమంది అంటున్నా, వెంకట్రావుకి మాత్రం ఇది మంచి అవకాశంగా తోచింది. తన పిల్లలు, ఇల్లాలి ఆశలు తీర్చాలంటే తాను ప్రైవేటు బ్యాంకుకి వెళ్లిపోవాలి. పని ఒత్తిడి

ఎంతున్నా పరవాలేదు. ఇంటికెళ్ళి తను చేసే పని ఏమీ లేదు. ఇప్పుడు తన కుటుంబ సభ్యులకి తనకన్నా తను తెచ్చే డబ్బు అవసరమే చాలా ఎక్కువ. రోజంతా ఉద్యోగం చెయ్యాలన్నా సిద్ధమే అని అనుకున్నాడు.

తన సొంతూర్లో అందమైన పొదరిల్లుని వదిలి వచ్చేసాడు. పొదరిల్లులో ఉండలేనప్పుడు ఆఫీసులో ఉన్నా ఒకటే, అద్దె అపార్ట్‌మెంట్‌లో ఉన్నా ఒకటే. తనకున్న ఇరవై ఏళ్ల బ్యాంకింగ్ అనుభవంతో అక్కడ ప్రైవేటు బ్యాంక్‌లో కనీసం నలభైవేలయినా డిమాండ్ చెయ్యొచ్చు అని అనుకున్నాడు. అంటే ఇప్పుడు తనకి వచ్చే జీతానికి రెట్టింపు అన్నమాట. తనలాగే ప్రయత్నిస్తున్న మరో ఇద్దరితో కలిసి ప్రయత్నాల్ని ముమ్మరం చేసాడు. అమెరికా మార్కెట్‌లో అతిపెద్ద బ్యాంక్ ఒకటి హైదరాబాద్‌లో కొత్తగా బ్రాంచ్ ప్రారంభిస్తోంటే అందులో ముగ్గురికీ అవకాశం దొరికింది. నెలకి ముప్ఫై అయిదు వేల జీతంతోపాటు, చేసిన బిజినెస్ మీద ఐదు శాతం కమిషన్ కూడా వస్తుంది. ఎంత కష్టపడితే అంత ఆదాయమన్నమాట.

అయితే ఇన్నాళ్లలాగా ఆఫీసులో ఫ్యాన్ క్రింద ఉద్యోగం కాదు ఇప్పుడు, నేరుగా కస్టమర్స్ ఇళ్లకి వెళ్లి ప్రొడక్ట్స్ గురించి చెప్పాలి. ఉదయం ఏడు గంటలకే ఉద్యోగం ప్రారంభమయిపోతుంది. మళ్లీ ఇంటికొచ్చేసరికి రాత్రి పదే. మధ్యలో ఆకలేస్తే బయట తినడమే. ఎండల్లో తిరగడం, బయట భోజనంవలన ఆరోగ్యం బాగా దెబ్బతింది. మనిషిలో బొత్తిగా కళ లేకుండా పోయింది. అయితే అమెరికా బ్యాంక్ అనేసరికి బిజినెస్ సులువుగానే అయిపోతోంది. అనుకున్న సమయంకంటే ముందుగానే టార్గెట్లు చేరుకుంటున్నారు. ఆదాయం నెలకి ఏభై వేలకి పైనే కిడుతోంది. కూతురుకి స్కూటీ, కొడుక్కి, బైక్, శ్రీమతి స్వప్నం నిజం చెయ్యడానికో కారు సులభ వాయిదాల్లో తీర్చే విధంగా ఋణాలు తీసుకుని కొనేసాడు.

హైదరాబాద్ ఔట్ స్కర్ట్స్‌లో కొత్తగా అభివృద్ధి చెందుతున్న ఏరియాలో ఒక ఫ్లాట్‌ని బుక్ చేసాడు. దాని గురించి ఇవ్వాల్సిన ఎడ్వాన్స్‌ని తాను ముందు పనిచేసిన ప్రభుత్వరంగ బ్యాంక్ నుండి పదవీ విరమణ సందర్భంగా వచ్చిన డబ్బుని ఇచ్చేసాడు. ఫ్లాట్ గురించి కూడా ఋణం సులువుగానే మంజూరయ్యింది.

స్కూటీ, బైక్, కారు, ఫ్లాట్ గురించి చేసిన అప్పుల కోసం వాయిదాలు చెల్లించడానికే వెంకట్రావు జీతంలో సగానికి పైగా పోతోంది. లాంగ్ టర్మ్ కోచింగ్‌కి వెళ్లినా అబ్బాయికి మళ్లీ ఐఐటిలోనే కాదు ఎమ్‌సెట్‌లో కూడా పెద్ద ర్యాంక్‌లే వచ్చాయి. అమ్మాయికి మాదిరి ర్యాంక్ వచ్చినా మెడిసిన్ కావడంతో సీటొచ్చే అవకాశం లేదు. హైదరాబాద్ ఎందుకోసం వచ్చాడో ఆ పనే విఫలమవ్వడంతో తీవ్రమైన నిరాశకు గురయ్యాడు వెంకట్రావు. తిరిగి తల్లి లాంటి సొంతూరుకి వెళ్లిపోవాలనిపించింది. కానీ తన భార్యాపిల్లలకి హైదరాబాద్ మత్తు ఎంతగా పట్టిందంటే, హైదరాబాదే సొంతూరులా భావిస్తున్నారు. మల్టీప్లెక్సులు, షాపింగ్ మాల్స్, అపార్ట్‌మెంట్‌ల ఆధునిక సంస్కృతి వాళ్ల రక్తంలో జీర్ణించుకుపోయింది. దీనికితోడు ఇప్పుడు ఉద్యోగంచేస్తున్న ప్రైవేటు బ్యాంకులో ఉన్నవాళ్లు సొంతూరు వెళ్లగలిగేది పండుగలకి పబ్బాలకి తప్ప శాశ్వతంగా వెళ్లలేడు. ఎందుకంటే ఈ ప్రైవేటు బ్యాంకుకి రాష్ట్రంలో హైదరాబాద్ తప్ప మరెక్కడా శాఖలు లేవు. చేసేది లేక కొడుకుని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో పేమెంట్ సీటు దొరికితే జాయిన్ చేసాడు. కూతురుని లాంగ్ టర్మ్ కోచింగ్‌లో జాయిన్ చేసాడు.

వెంకట్రావు జీవితం ఒక మరమనిషి జీవితంలా తయారైంది. మీటనొక్కితే స్పందించే యంత్రంలా తయారయ్యాడు. కానీ అతని శరీరం, మనసు, అంతరాత్మ యాంత్రిక జీవితంతో సర్దుబాటు కాలేకపోతున్నాయి. జీవితంలో వచ్చి మార్పులను తట్టుకోలేక మనసు, అంతరాత్మ నిత్యం సంఘర్షిస్తూనే ఉన్నాయి. శరీరంలో కీలక అవయవాలు ఒత్తిడిని అధిగమించలేకపోతున్నాయి. తనచుట్టూ ఆవరించిన ప్రతికూల పరిస్థితులను అధిగమించలేక డిప్రెషన్‌లో కూరుకుపోయాడు. ఆరోగ్యం రోజురోజుకీ కునారిల్లిపోతోంది.

ఒకరోజు ఉద్యోగరీత్యా ఒక ప్రొఫెసర్‌ని కలుసుకోవడానికి ఉస్మానియా యూనివర్శిటీకి వెళ్తోంటే బస్సులోనే కళ్లు తిరిగి పడిపోయాడు. అతని మెడలో ఉన్న ఐడెంటిటీ కార్డు ఆధారంగా ఇంట్లో వాళ్లకి, ఆఫీసు వాళ్లకి సమాచారం వెళ్లింది. ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో జాయిన్ చేసారు. తీవ్రమైన ఒత్తిడి కారణంగా మెదడులో రక్తస్రావం జరిగిందని, రెండురోజులు గడిస్తేకాని చెప్పలేమని, అంతవరకు వెంటిలేటర్ మీదే ఉంచాలని డాక్టర్లు రాబోయే ఉపద్రవాన్ని చూచాయగా చెప్పి తప్పుకున్నారు. టెస్టులని, స్కానింగ్‌లని వరదలా డబ్బులు ఖర్చుపెట్టిస్తున్నారు కానీ బ్రతుకుతాడన్న భరోసా మాత్రం ఇవ్వలేకపోతున్నారు. చివరికి రెండురోజులు భారంగా గడిచాయి. అప్పటికే వెంకట్రావు భార్య బంగారం కుదువపెట్టి తెచ్చిన డబ్బులన్నీ హారతయిపోయాయి. వెంకట్రావు తల్లిదండ్రులు తమ కొడుక్కి పట్టిన దుస్థితికి కన్నీరుమున్నీరవుతున్నారు. మెడికల్ ఖర్చుల్ని ఒక ఉద్యోగికి ఇవ్వాల్సిందే కనీసం ఒక సంవత్సరం సర్వీసైనా ఉండాలని, అది వెంకట్రావుకి లేదు కాబట్టి ఒక్క పైసా కూడా ఇవ్వలేమని ప్రైవేటు బ్యాంక్ మేనేజ్‌మెంటు చేతులెత్తేసింది.

**భర్త తమ కోరికల్ని తీర్చడానికి ఎన్ని వ్యయ ప్రయాసలకోర్చాడో, ఎంత మనోవేదన పడ్డాడో అప్పటికి గాని గుర్తురాలేదు వెంకట్రావు భార్య రత్నానికి. చేజేతులారా భర్త ప్రాణాల్ని ముప్పకి గురి చేసిన భావన కలిగింది.**

వెంకట్రావుని చూడటానికి ప్రస్తుతం పనిచేస్తున్న ప్రైవేటు బ్యాంక్ కొలీగ్స్‌కన్నా పాత ప్రభుత్వరంగ బ్యాంక్ కొలీగ్సే ఎక్కువగా వచ్చారు. నాలుగోరోజు సాయంత్రానికి వెంకట్రావు మెల్లగా కళ్లుతెరిచాడు. ఎదురుగా భార్య కనిపించింది. 'మనూరు వెళ్లిపోదామా'అని అతి కష్టంమీద కూడబలుక్కుంటూ అన్నాడు.

'మీరు కోలుకున్నాక తప్పకుండా వెళ్లిపోదామండీ' ఉబికి వస్తున్న కన్నీళ్లను ఆపుకుంటూ అంది.

భర్త తమ కోరికల్ని తీర్చడానికి ఎన్ని వ్యయప్రయాసలకోర్చాడో, ఎంత మనోవేదన పడ్డాడో అప్పటికి గాని గుర్తురాలేదు వెంకట్రావు భార్య రత్నానికి. చేజేతులారా భర్త ప్రాణాల్ని ముప్పుకి గురిచేసిన భావన కలిగింది. భర్త బ్రతికితే చాలు, ఉద్యోగం లేకపోయినా, సొంత ఊరులో వ్యవసాయం చేసయినా భర్తని పోషించుకోవచ్చన్న నిర్ణయానికొచ్చేసింది.

రాత్రి ఆసుపత్రిలోనే ఐసియు బయట ఉన్న లాంజ్‌లో కుర్చీలో కూర్చుని కునికిపాట్లు పడుతున్న రత్నానికి వినీవినపడనట్లుగా మాటలు వినిపించగా కళ్లు తెరిచి చూసింది. తన కొడుకు మనోహర్ నైట్‌డ్యూటీ డాక్టర్‌తో మాట్లాడుతున్నాడు.

'డాక్టర్, డాడీ కోలుకునే అవకాశముందా?'

'నాకు తెలిసి మీ నాన్నగారు ఉన్న పరిస్థితిలో కోలుకోవడం అసంభవం. ఇప్పుడు మీ నాన్నగారు ఉన్న పరిస్థితిని 'క్లినికల్లీ డెడ్' అంటారు. ఈ కార్పొరేట్ హాస్పిటల్‌కి కొన ఊపిరితో కొట్టుమిట్టాడే మీ నాన్నగారిలాంటి వారే కల్పతరువుల్లాంటివారు. ఎన్నాళ్లు డ్రాగాన్ చేస్తే మేనేజ్‌మెంటుకి అంత లాభం. ప్రాణాపాయంలో ఉన్న వారిని హాస్పిటల్ నుండి నిర్దాక్షిణ్యంగా తీసుకెళ్లలేని మీ సెంటిమెంటు మిమ్మల్ని కట్టిపడేస్తుంది. మీ పెద్దవాళ్లతో మాట్లాడి చూడు. నేను చెప్పినట్లు మాత్రం ఎవరి దగ్గరా అనకు' అని రౌండ్లకు వెళ్లిపోయాడు.

మరునాడు ఉదయాన్నే మనోహర్ తల్లి దగ్గరకు వచ్చి రాత్రి నైట్ డ్యూటీ డాక్టర్ చెప్పిందంతా చెప్పి 'మనం ఈ హాస్పిటల్‌నే పట్టుకుని వేలాడితే మనల్ని బిచ్చగాళ్లని చేసేస్తారమ్మా, ఈరోజే మనం నాన్నని డిశ్చార్చ్ చేయించుకుని ఇంటికెళ్లిపోదాం' అన్నాడు.

'వెంటిలేటర్ మీదున్న మనిషిని ఎలా డిశ్చార్జ్ చేస్తార్రా, ఆయన ప్రాణాలకు ముప్పు ఉండబట్టేకదా వెంటిలేటర్ మీదుంచారు.' దుఃఖాన్ని ఆపుకుంటూ అంది రత్నం.

'ఆయన ఇప్పుడు బ్రతికున్నా ఒక విధంగా చనిపోయినట్లే. ఈ పరిస్థితినే వైద్య పరిభాషలో 'క్లినికల్లీ డెడ్' అంటారట. నాన్న వెంటిలేటర్ మీద ఉన్నన్నాళ్లు ఊపిరాడుతుంది, వెంటిలేటర్ తీసెయ్యగానే ఊపిరాగిపోతుంది. మనకి రోజుకి పదినుండి పదిహేను వేల దాకా ఖర్చు తప్ప ఏ ఉపయోగమూ లేదు' అన్నాడు.

కొడుకు మాటలతో రత్నానికి దుఃఖంతో కూడిన ఆగ్రహం ఒక్కసారిగా పెల్లుబికింది. 'ఆయన ఈరోజు ఇలా ఆసుపత్రిలో జీవచ్ఛవంలా పడున్నాడంటే కారణం మనమే. మనం కోరిన కోరికలు తీర్చడానికి రేయింబవళ్లు శ్రమించి ప్రాణాలమీదకు తెచ్చుకున్నారు. ఆయన ప్రాణం నిలపడానికి నా దగ్గరున్న ప్రతి రూపాయి ఖర్చుపెడతాను. ఇల్లు, పొలం, పుట్ర అన్నీ తెగనమ్మేసయినా ఆయన ప్రాణాల్ని కాపాడుకుంటాను. ఆయన ప్రమాదం నుండి బయటపడి మళ్లీ ఎప్పటిలా తిరగాలి. ఈ నిర్ణయానికి కట్టుబడి ఉంటే ఇక్కడుండు లేకపోతే వెళ్లిపో...'అని దిక్కులు పిక్కటిల్లేలా అరిచింది.

రత్నం మాటల్ని లాంజ్‌లో ఉన్న వాళ్లందరూ విన్నారు. అందరి కళ్లలో కనీకనిపించని కన్నీటి తెర కనిపించింది. మనోహర్ తల దించుకుని బయటకెళ్లిపోయాడు. కూతురు ప్రియాంక, రత్నం ఒడిలో తలపెట్టి వెక్కివెక్కి ఏడుస్తోంది.

రత్నం ఐసియు ముఖ ద్వారం మీదే చూపు నిలిపి నిర్వేదంగా కనురెప్ప వెయ్యకుండా చూస్తోంది. ఎప్పుడు డాక్టర్ వస్తాడా, తన భర్త ప్రాణాలకి ముప్పులేదని చెప్తాడా, భర్తని సొంతూరుకి తీసుకెళ్లి స్వాంతన కలిగిద్దామా అని ఎదురుచూస్తోంది.

ఇప్పటిదాకా తల్లీకొడుకుల మాటల్ని విని, ఇప్పుడు తల్లీకూతుళ్ల దుఃఖాన్ని చూస్తున్న నైట్ డ్యూటీ డాక్టర్ డ్యూటీ దిగిపోవడానికి సన్నద్ధమవుతూ పేషెంట్ మాత్రమే క్లినికల్లీ డెడ్ కాదు కుటుంబం మొత్తం క్లినికల్లీ డెడ్ స్థితిలో ఉందని అనుకోకుండా ఉండలేకపోయాడు.

★

రచయిత్రి చిరునామా:
డి.సుగుణమణి,
ప్లాట్ నెం.3, జగన్నాథ్‌నగర్, సన స్ట్రీట్,
శ్రీకాకుళం- 532 001.